బంధము

శ్రీమతి కె. లక్ష్మీరఘురామ్.

"ఎక్కడికి ప్రయాణము" అని ప్రశ్న. "అరవిందాశ్రమానికి" అని జవాబు. ఈ ప్రశ్నకి ఈ జవాబు వచ్చినప్పుడు ఇంటిల్లపాదీ భయపడతారు. అంటే ఇహ ఎన్నో టపాకాయలు పేలుతవన్నమాట! ఇల్లంతా కాస్సేపు నిశబ్దంగావుంది.

"అరవిందాశ్రమానికెందుకులే. నీవే ఓ స్వాములారై మన తోటమూలలోవున్న చింతచెట్టు క్రింద ఓ ఆశ్రమము ఏర్పాటు చెయ్యి. అన్నివిధాలా లాభదాయకంగా వుంటుంది" అని సలహా....'నిజమే! వ్యాపార రీత్యా ఆలోచిస్తే మంచి లాభాలే పొందవచ్చు. కాని పిల్లికి చెలగాటము ఎలుకకు ప్రాణపోకట' మన్నట్లు — సలహా ఇచ్చినవారికి అంతా హాస్యముగ్గా, వినోదంగా వుండవచ్చు. వారికేమి తెలుస్తుంది నా బాధ. బాధ్యతా రహితమైన మాటలు ఏవో మాట్లాడుతారు. ఉదయమునుండి రాత్రివరకు ఇంటి పనులతో సతమతమై ఓ క్షణము విశ్రాంతి లేకుండా విరగ పడుతూవుంటే ఆశ్రమము అవలంభించాలట! ఎవరికైనా వళ్లుమండదూ ఈ పరిస్థితుల్లో? పైగా ఎండాకాలము కూడానూ. మార్చినెల. అప్పుడే ఎండలు చాలా తీవ్ర రూపము దాల్చినవెందుకో ఈసంవత్సరము. వళ్ళు చిట పట మంటోంది. పిల్లలకు పరీక్షల రోజులు. ఒకరు ఆర్కిమెడిస్ ప్రిన్సిపిల్ ఒప్పచెపుతాము వినమంటే, ఇంకొకరు భర్తృహరి పద్యాలు వినమంటూ చేతిలోకి పెన్సిల్సు చెక్కమని అందిచారు. పరీక్షలప్పుడు పారేస్తే చిన్న బుచ్చుకుంటారని వూరుకున్నాను కాని, లేకపోతే ఆపెన్సిల్సును తోటలోకి గిరవాటు వేసేదాన్నే. ఈ పెన్సిల్సు పాతాలవ్యవహారము ముగించుకొని [illegible] ఆశ్రమము వ్యవహారమునకు వద్దామనుకున్నా గాని, నేను పుట్టిన రౌద్రనామ సంవత్సరదోషము వల్ల. బ్రహ్మగారు మనకుపోసిన ఎక్కువడోసు రౌద్రము దూసుకు వచ్చింది. "ఆ ఆశ్రమాలే ఆరంభిస్తాను. మీకేమి హాయిగా ఫానుక్రింద కుర్చీలో కూర్చుని ఊళ్ళోవాళ్ళకి సలహాలిస్తూ వుండచ్చు" అని అన్నాను.

"ఊళ్ళోవాళ్ళ కెందుకిస్తాను. ఇంట్లోవాళ్ళకే సలహాలిచ్చేది. నీవుకూడా ఫానుక్రింద కూర్చోరాదూ? గొడవ చేయకుండా" అని మాచౌదరిగారు సెలవిచ్చారు ....

"అవును కూర్చుంటే కుదురుతుంది అన్నీ బాగానే! పైగా గొడవకూడానా! అందరి ఇళ్ళల్లో భర్తలూ తమభార్యలని ఈలాగే కూర్చోమని సలహాలిస్తారట - మా స్నేహితులు చెప్పారులెండి - మరి ఎందుకు కూర్చోరో అందరికీ తెలిసిన విషయమేగా?"

పిల్లలు పుస్తకాలు అందుకొని పెన్సిల్సు పుచ్చుకొని "బాగావచ్చినవా అమ్మా?" అన్నారు. "ఎక్కడొచ్చింది 'నలరవిదేని చేదిరుగు నాఘనకర్మము వంద్యమేకదా' అన్న పాదము ఆ 'నలవ'కులాల భంగి పద్యములో ఎగరగొట్టా"వన్నాను. "పెద్ద శ్రుతిలో సుజనపద్ధతి ఆరంభము నా ఆఫీసుకు టైమైంది. టెలిఫోనులో మిమ్మలను ఎవరో పిలుస్తున్నారు అమ్మగారు. నాకు ఇడ్లీ వద్దు బ్రెడ్డు కావాలి, బట్టలుతికే సబ్బు అయిపోయిందండీ. కారులో పెట్రోలు లేదు. నాకూడా బస్సుకు చిల్లర కావాలి" వగైరా వగైరా. ఈ శతావధానము ముగించుకొనేటప్పటికి గడియారము టంగ్ టంగ్ మని పదకొండు కొట్టింది. పడక కుర్చీలో వ్రాలి 'ఆశ్రమము' సంగతి మళ్లీ ఆలోచించా. "తీరా పరీక్షలప్పుడు నేను ఆశ్రమానికి వెళితే పాపము పిల్లలు ఇబ్బంది పడిపోరూ. ఛే! అయినా ఆశ్రమాలకు వెళ్ళటమేమిటి. బుద్ధిగడ్డితింటున్నట్లుంది! (అదే ఎవరన్నా అంటే వూరుకోమనుకోండి!) పిల్లలు పరీక్షలు ముగించిన తరువాత శలవల్లో ఈసారి మద్రాసుకు. ఈబాదరబందీని వదిలించుకొని ఒక పదిహేను రోజులైనా విశ్రాంతి తీసుకోవాలి. పిల్లలకు కులాసాగావుంటుంది ఎక్కడికైనా వెళితే. వూటీకో, బెంగుళూరో వెళితే బాగుండేటట్టుగావుంది. అక్కడ! చల్లగా వుంటాయని ఆసపడి ఈవూళ్లు వెళితే నాకు విశ్రాంతి ఎక్కడ? స్వర్గానికి వెళ్లినా తెడ్డేనా' అన్నట్లు అక్కడికి వెళ్ళి మళ్లీ ఇల్లూ, పిల్లలూ, వంటా, నౌకర్లు రభస తప్పదుగా. ఎక్కడికి వెళ్ళితే హాయిగా పనిచేయకుండా కూర్చోవచ్చోనని ఆలోచించి - అమ్మగారింటికి వెళితే బాగుండుననుకొని, మళ్ళీ ఎండలు తలచుకొని భయపడి వూరుకొన్నాను"

ఆనాడు సాయింకాలము తండ్రీ పిల్లలూ ఎదో గుసగుసలాడుతున్నారు. వరండాలో కూర్చుని నన్నుచూడగానే అదోవిధంగా నవ్వారు - "ఏమిటి మీ మంతనాలు"

అన్నాను. "ఏమీలేదు అమ్మా! మేమందరం ఒక ప్లానువేసు కున్నాము శెలవలకి" అన్నారు. "ఇంకా పరీక్షలు ఆరంభ మన్నా కాలేదు అప్పుడే శెలవల సంగతి ఆలోచిస్తున్నారా పోయి చదువుకోండి" అనగానే "అమ్మో! పరీక్ష"లను కుంటూ పరుగెత్తారు పుస్తకాల దగ్గిరకు.

"ఏమిటి మీప్లాను?" అన్నాను.

"నేను మనవూరు వెళ్ళాలి. చాలాపనులున్నవి. అక్కడకు పిల్లలూ వస్తామంటున్నారు. ఎట్లాగయినా వీలుచేసుకొని ఈసారి నీవుకూడా బయలుదేరితే అందరమూ వెళ్ళి ఒక నెల రోజులుండి వద్దాము" అని అన్నారు. 'రోగి కోరిందే వైద్యుడు చెప్పా'డని మనస్సులో అనుకొని "సరే" నన్నాను.

రాత్రి పడుకుంటే నిద్రపట్టలేదు. ఆ కోపములో, ఆ విసుగులో ఉదయము ఎక్కడికైనా వెళ్ళితే బాగుండునను కున్నాను. గాని ఎక్కడికి వెళ్ళేది? ఇల్లువొదలి వెళ్ళాలంటే సామాన్యమైనపనా? గొడ్లు గోదా, తోటాగీటా అన్నీ చెడి పోవూ మళ్ళీ తిరిగి వచ్చేలోపల! పైగా 'సరే' నని ఒప్పు కున్నానే మా చౌదరిగారితో. మళ్ళీనేను రానంటే "ఇదుగో మీ ఆడవాళ్ళకున్న బుద్ధేఇది, కాస్సేపుకోమాట" అని కోప్ప డరూ! "రేపుచూద్దాములే" అని అనుకుంటూ నిద్ర పోయాను. నాజీవితంలో చిత్రంగా నిద్రే నాసమస్య లెన్నిటినో పరిష్కారము చేస్తుంది.

* * *

పిల్లల పరీక్షలైపోయిన తెల్లవారే స్వగ్రామమునకు కారులో ప్రయాణము.

ఇంకా చీకటుండనగానే స్నానపానాదులు ముగించు కొని, కారులో సామానులు సర్దుకొని బయలు దేరినాము. నెల్లూరువరకు ప్రయాణము హాయిగానేవుంది. అక్కడ నుంచే మేము ఒక్కొక్కమైలు ముందుకు పోతున్నకొద్దీ వేడిమి ఒక్కొక్క డిగ్రీ హెచ్చుతున్నట్లు తోచింది. ఒంగోలు దగ్గర ఒకమామిడి తోటలో ఆగి భోజనాలు ముగించి అరగంటసేపు విశ్రమించి తిరిగి ప్రయాణము సాగించాము. చిలకలూరుపేట సమీపము చేరేటప్పటికి ఎండలు నిప్పులుచెరుగుతున్నవి.

"కారు కొంచెము ఆపండి" అన్నాను.

"ఎందుకు?"

"పనుంది కాస్త ఆపాలి" .... గానుగ చెట్టుక్రింద కారు ఆగింది. కారులోనుంచి నేను దిగాను.

"మీరుదిగరా"అన్నాను కారులోనివాళ్ళతో"ఈఎండలో మేము దిగము"అని ఒకరు జవాబు "ఓయి!"అని మరొకరి కేక. "ఎందుకు అట్లా కేకలేస్తా"రని గద్దించాను. "చూడు పైన ఏముందో" అని అందరూ ఏక కంఠముతో అరుపు. చెవులు మూసుకొని పైకి చూతునుకదా ఓపెద్దకోతి చెట్టు కొమ్మమీద కూర్చునివుంది. అక్కడికి ఒక ఇరువైగజాల దూరాన ఒక కాలవవున్నది. ఆకాలువలో నీళ్ళు ఎండాకాల మైనా ప్రవహిస్తూనే వున్నవి. ఆకాలవలోని చల్లటినీళ్ళతో ముఖము కాళ్ళు కడుక్కుంటే ఎండ తాపం తగ్గుతుందనే నేను కారు అక్కడ ఆపమన్నాను. ఒక టవలు, లోటా తీసుకొని నేను ఆకాలువ దగ్గిరకు వెళ్ళడము చూచి "అమ్మా! అక్కడ కోతులున్నయ్" అని పిల్లలు కేక లేశారు. "ఏమీ ఫరవాలేదులే వాళ్ళు అమ్మ చుట్టాలే" అని పిల్లలకు ఓకొత్తవార్త. "కోతులు నన్నేమి చేస్తవిలే" నని నేను వెళ్ళి కాలువలో దిగపోయాను. లోతుగా వున్నట్లు తోచింది. అందుకని ఇంకాకొంచెము ముందుకు పోయి నీళ్ళలో బండలు కనపడితే ఆబండమీదకు దాటి నీళ్ళు అందుకుని ఆ చల్లటి నీళ్ళతో ముఖము, కాళ్ళు చేతులు కడుక్కుంటే ఎంతో ప్రాణానికి హాయనిపించింది. ఇంత లోకే కారులోంచి మళ్ళీ కోలాహలము. అందరూ హడా విడిగా చేతులూపుతున్నారు రమ్మనమని. వెనక్కి తిరిగి చూతునుగదా ఓకోతి మెల్లగా దగ్గరకువచ్చి నీళ్ళలోకి చూస్తూవుంది. నేను టవలుతో తుడుచుకుంటూ గానుగచెట్టు సమీపించాను.

"ఎంతసేపు కాలువదగ్గిర- కూర్చో కూర్చో- వాగులో దిగి కోతుల్ని పలకరించుతూ మార్గ మధ్యలో మజిలీలు చేస్తూవుంటే మనము మనవూరు చేరేటప్పటికి చీకటి బడు తుం"దని విసుక్కున్నారు - మమ్ములను సురక్షితంగా చేర్చవలసిన బాధ్యతగల మా చౌదరిగారు, ఎంతహాయిగా వుందిక్కడ- ఆకాలువ- ఆవనము- అంటూకూర్చున్నాను. కారు బయలుదేరింది. "ఏం! వనవాసమ్మీద కోరిక పుట్టు తుందా"అన్నారు. "వనవాసాలు కోరుకోకుండా మునుపు ఆ రామయ్య సీతమ్మకి బుద్ధివచ్చేట్టు చేశాడుగా" అన్నాను. ఎండల్లో మాడి గుంటూరు మూడుగంటలకి చేరాము.

అక్కడ ఐస్‌క్రీములు వేసి శరీరాలు కొంత చల్లబరుచుకున్న తర్వాత అయిదు గంటలకల్లా స్వగ్రామము చేరాము.

ఇహ నావిశ్రాంతి కార్యక్రమము ఆరంభించాలని నిశ్చయించుకున్నాను. అనుకొనటమేమిటి, పత్రికలలో ప్రకటించటము మినహా, పుట్టింటా - అత్తింటా బంధువులందరికీ తెలియ చేయించాము మనము విశ్రాంతి తీసుకోబోతున్నామని.

ఉదయము కాఫీ తెచ్చిఇస్తేనే నిద్రనుంచి లేద్దాము. భోజనానికి, స్నానానికి అన్నీ ఆయత్త పరచి కబురు వచ్చే వరకు కూర్చున్న చోటునుంచి లేవద్దని నిశ్చయించుకొన్నాను. పిల్లలకు - సెలవుల్లో పనులు నేర్చుకోవాలని చెప్పేశాను. కాని ఇదివరలోనే అందరికీ ultimatum ఇవ్వబట్టి పాపము అమ్మను తిప్పలు పెట్టవద్దు, మేము తలదువ్వుతాము, మేము బొట్టు పెడుతామని పిల్లల పనులన్నీ అందరూ అందుకున్నారు.

మొదటిరోజు ఉదయము కాఫీ వచ్చేవరకూ లేవలేదు. "అబ్బ ! ఎన్నాళ్ళకు నేనులేవకుండా కాఫీయే నాదగ్గరకు రావట"మని సంతోషించి- అమృతము త్రాగినట్లు ఆకాఫీని ఎంతో ఆప్యాయంగా త్రాగాను. 'అల్పసంతోషివి' అన్నది ముసలమ్మ. అల్పమో, స్వల్పమో ఈవిధంగా పదిహేను రోజులు గడుపదలచాను.

రెండోరోజు నిద్దరరాలేదు. తెల్లవారుఝామున కోడి కూసినప్పట్నుంచీ నిద్దర మెలుకువే. లేగదూడలు 'అంబా' అని అరుస్తూవుంటే జీతగాళ్ళకు లేచి పాలు పితగక తప్పిందిగాదు. ఇంట్లో పొయ్యివూదుట, చిమ్ముట కళ్ళాపు జల్లుట మొదలగు పనుల అలజడులు బయలుదేరినవి. కాళ్ళు చేతులు బాగానేవుండి నిద్దర రాకుండా మంచము పట్టుకు ఆలా పరుండటము నాకేమీ బాగుండలేదు. పైగా పెద్దవాళ్ళు లేచి పనులు యథావిధిగా చేసుకుంటూంటే, చిన్నదాన్ని, నేను సోమరితనముగా వుండటము ఏమీ బాగాలేదు. పెద్దవాళ్ళు నన్ను నిందించక పోయినా నేను చేస్తున్నపని నాకు నచ్చనిపించలేదు నా విశ్రాంతి నాకు మెల్లగా బాధగా వుండటముఆరంభించింది. నాల్గురోజులయే టప్పటికి 'విశ్రాంతి' భరించరానిదైనది. పోనీ ఏదైనా పని చేద్దామా అంటే అక్కడ నాకేమీ పనిచేయటానికి కుదరలేదు. అంతా క్రొత్తే. ఇహ ఇంటికి వెళ్ళుదామన్నాను. "ఏం ! ఇంటిమీద గాలిమళ్ళిందా" అని అందరూ నవ్వారు.

అక్కడ పనులు తొందర తొందరగా ముగించుకున్నాము. నాకు విశ్రాంతి విసుగుపుట్టినట్లే పిల్లలకు పరీక్షా ఫలితాల ఆరాటము ఎక్కువైంది. ఫలితాలు తెలియగానే సీట్ల అన్వేషణ ఆరభించాలిగా.—

రేపు ప్రయాణమన్నాము "వీల్లేదు రేపు అష్టమి ఎల్లుండి నవమి" అన్నారు చిన్నబాబాయి. "అప్పుడే బయలుదేరుతున్నారేమి? విశ్రాంతి తీసుకొన్నావా? వంట్లో సులువేనా" అన్నారు బుగ్గమీసాల సుబ్బయ్య మామ. "ఆ కులాసాగానే వుంద"ని జవాబిచ్చాను. దశమిరోజు ప్రయాణము నిశ్చయింపబడ్డది. సురక్షితముగా ఇల్లుచేరాము. తాళము తీసి 'అబ్బ! ఎన్నాళ్ళకి' అని సోఫాలో కూలబడ్డాను.

"విశ్రాంతి చాలిందా" అన్నారు తపాలా చూచుకుంటూ మా చౌదరిగారు.

"ఆఁ" అన్నాను క్లుప్తంగా.

"దైవమెంతటి చిత్రపు బంధముతో స్త్రీని గృహానికి బంధించాడో" నని ఆలోచించటము మొదలు బెట్టాను మొదటి సారిగా !

★